క్లుప్తంగా

పల్స్ పోలియోపై అవగాహన

రుద్రూర్: పోతంగల్ రైతు వేదికలో సోమవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలో 55 పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే నెల 3న ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సాయి కుమారి, జ్యోతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కబడ్డీ జట్టుకు అభినందనలు



బాల్కొండ: సూర్యాపేట్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇంటర్ జిల్లా బాలికల సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడవ స్థానం సాధించిన జట్టుకు సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఒక్కొక్కరికి స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంజయ్య రూ.1,000 అందించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య, ఉపాధ్యక్షుడు గంగాధర్, ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

భీమ్‌గల్: కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకోవాలని సికింద్రాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్ కార్యాలయానికి గ్రామస్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ఒక నాయకుడు సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఆ భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకొని పేదలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

బీడీ కార్మికుల సమస్యలపై పోరాడుతాం


బోధన్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దాల్‌మల్క పోశెట్టి తెలిపారు. యూనియన్ స్వర్ణోత్సవ సంవత్సరం ముగింపు సభను మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం పట్టణ కేంద్రంలో బీడీ కార్మికులతో కలసి ఆవిష్కరించారు.

పాలెంవాసికి స్వర్ణ నంది అవార్డు



మోర్తాడ్: డాక్టర్ కే. విశ్వనాథ్ 94వ జయంతి సందర్భంగా పాలెం గ్రామానికి చెందిన వేద, జ్యోతిష్య పండితులు సాహసం రంజిత్ శర్మకు స్వర్ణ నంది అవార్డును హైకోర్టు జడ్జి రాధారాణి అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో మినిస్టర్ ఆఫ్ కల్చర్ డాక్టర్ ఎస్పీ భారతి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడులు ఆపాలి



బోధన్: పంటలకు కనీస మద్దతు ధర, గ్యారంటీ చట్టం కోసం ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రైతులపై దాడులు ఆపాలని కోరుతూ సోమవారం బోధన్ ఆర్డీవో ఆఫీసులో అధికారికి అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, నాయకులు వినతి పత్రం అందించారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారుసుల మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు షేక్ నజీర్, సుల్తాన్ సాయిలు, సీతారా, రవి, సిద్ధ పోశెట్టి, శ్రీపతి మల్లేశ్ పాల్గొన్నారు.

జోరందుకున్న భూసర్వే



బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబరు-1333లో గల ప్రభుత్వ భూమిపై సర్వే జోరందుకుంది. పది రోజుల క్రితం ప్రారంభమైన సర్వే ఆగుతూ.. సాగుతూ కొనసాగుతోంది. సోమవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాగింది. త్వరలోనే సర్వే పూర్తి చేసి తుది నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. సర్వేను తహసీల్దార్ శ్రీధర్ పర్యవేక్షించారు. ఆర్ఐ రాఘవేందర్, తదితరులున్నారు.

గంగమ్మ తీరాన శివయ్య!

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తీరంలో పూర్తయిన శివాలయం
- నాగాపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మాణం



నిర్మించిన ఆలయం



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న ధ్వజ స్తంభం

బాల్కొండ: నాగాపూర్ శివారులో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం తీరంలో శివాలయ నిర్మాణం పూర్తయింది. దీంతో గంగమ్మ తీరాన శివయ్య అంటూ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాతల సహకారంతో శివాలయ నిర్మాణానికి గతేడాది డిసెంబర్ మాసంలో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి పనులను వేగంగా కొనసాగించారు. పనులు పూర్తయి ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపనకు సిద్ధమైంది. గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన దాతలు కూడ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేశారు. సుమారుగా రూ.50 లక్షల వరకు ఖర్చు అయినట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. నాగాపూర్ శివారులో ఉండటం వల్ల నాగలింగేశ్వర స్వామి ఆలయంగా నామకరణం చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..

శివాలయ నిర్మాణం పూర్తి కావడంతో మంగళవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. పూజలు, ఉత్సవాలన్నీ ఫల్గుట్ట మహరాజ్ మంగిరాములు చేతుల మీదుగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అదృష్టంగా భావిస్తున్నాం..



మా గ్రామంలో నాగలింగేశ్వర స్వామి ఆలయం నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నాం. మా వంతు సహకారం కూడ అందించడం ఆనందంగా ఉంది. గంగమ్మ వద్దనే శివయ్యను నిర్మించుకున్నాం.

– ఎంబరి చిన్న నారాయణ, గ్రామస్తుడు

భక్తితో పూజలు చేస్తాం..



దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో నిత్యం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తాం. ఆలయ నిర్మాణం ఏడాదిలో పూర్తి చేశాం. దేవాలయనికి మా వంతు సహకారం అందజేసే భాగ్యం కలగడం అదృష్టం.

– జక్క చిన్న రాజేశ్వర్, గ్రామస్తుడు

అక్రమ నిర్మాణాన్ని నిలిపేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జీపీ కార్యాలయం సమీపంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం నిలిపేశారు. 'సాక్షి' దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన 'అనుమతులు లేకుండా నిర్మాణం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణంలో భాగంగా పునాది కోసం తీసిన గోతులను అధికారులు పూడ్చి వేయించి పనులను ఆపేశారు. మున్సిపల్ అధికారుల చర్యలతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అక్రమ నిర్మాణం కోసం తీసిన గుంతలు



గుంతలను పూడ్చి వేసిన తర్వాత..

కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అభయ ఫౌండేషన్ సభ్యులు

ఎడపల్లి(బోధన్): విద్యార్థులు కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని టీఎస్ఆర్ జేసీలో అభయ ఫౌండేషన్ ద్వారా రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రయివేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన బాగుంటుదన్నారు. ప్రతి మండలానికి రాబో యే రోజులలో అంతర్జాతీయ స్థాయి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అభయ ఫౌండేషన్ సభ్యులు బాలచందర్, జెడ్పీ వైస్‌చైర్మన్ రజితాయాదవ్, సొసైటీ చైర్మన్ సత్యనారయణ, మాజీ సర్పంచ్ శంకర్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మునినాయక్, ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. మామిడిపల్లిలో సోమవారం విజయ సంకల్ప యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీ నర్సింహా రెడ్డి మాట్లాడుతూ..అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు నిర్వహించే విజయ సంకల్ప యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు. నాయకులు ద్యాగ ఉదయ్, పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బలం పెంచుకుని పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచుకుని లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికి ప్రజాసేవే ధ్యేయంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని అన్నారు. అలాగే ప్రతి గ్రామంలో కార్యకర్తలు పాత, కొత్త బేధాలు లేకుండా పార్టీ పటిష్ఠత కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సీనియర్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చి గెలిపిస్తామని భరోసా ఇచ్చారు.

బీజేపీలో శివసేన నాయకుల చేరిక



బీజేపీలో చేరిన శివసేన నాయకులతో ఎంపీ అర్వింద్, మేడపాటి ప్రకాశ్ రెడ్డి

బోధన్: బోధన్ పర్యటనకు వచ్చిన ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో సోమవారం పట్టణ కేంద్రానికి చెందిన శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసులేటి గోపికిషన్ నాయకత్వంలో శివసేన నాయకులు, 200 మంది వరకు కార్యకర్తలు బీజేపీలో చేరారు. పట్టణంలోని బీటీనగర్‌లో చేరిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ కండువాలు కప్పి వారిని ఎంపీ అర్వింద్ ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. బోధన్ బల్దియాలో అధికారం కైవసం చేసుకోవాలని పేర్కొన్నారు. గోపి కిషన్ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తున్న క్రియాశీల నాయకుడని, ఆయన సేవలు పార్టీకి అవసరమని తెలిపారు. గోపికిషన్ మాట్లాడుతూ..పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని, ఎంపీ ఆహ్వానం మేరకు తాను పార్టీ నాయకులు బీజేపీలో చేరినట్లు వెల్లడించారు. నాయకులు ప్రీతం గౌడ్, ప్రీతం, భూమన్న, విజయ్ ,లోకేష్ గౌడ్, కృష్ణ, కిషోర్, లింగం, శ్రీను, తోట రాజు, సురేందర్, పోతన్కర్ రామక్రిష్ణ, హన్మాండ్లు, ఆకుల రాజు, నాగేందర్, శ్రావణ్, ద్రౌపది లక్ష్మణ్ ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, నర్సింహారెడ్డి, అడ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



పాల్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రుద్రూర్: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉండి, పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. రుద్రూర్‌లో సోమవారం రాయకూర్ ఎంపీటీసీ హన్మంత్‌రావ్ పటేల్, అక్బర్‌నగర్ తాజా మాజీ సర్పంచ్ గంగామణి ప్రసాద్‌కు పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాత, కొత్త అని తారతమ్యం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలువడానికి ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుని ప్రజా సమస్యలను గాలికి వదలేసిందని విమర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్ర శేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్, తాహెర్‌బిన్ హందాన్, ఉజ్వల్ రెడ్డి, వర్ని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మేక వీర్రాజు, యలమంచిలి శ్రీనివాస్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ నుంచి పలువురి చేరిక

బోధన్: స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సమక్షంలో సోమవారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ కౌన్సిలర్ పాల్, ఎరాజ్‌పల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ వెంకటేషలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన నేత ఎన్టీఆర్



రుద్రూర్:రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన నేత ఎన్టీఆర్ అని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రంలో పలువురికి రాజకీయ భిక్ష పెట్టిన నేత ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, విండో చైర్మన్ కూచి సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు



మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారులోని గుత్ప చౌరస్తా వద్ద ఉన్న అపురూప వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యతో తరలి వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ అమృతలత, ప్రభ దేవి, రాజారెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (మంగళవారం) వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ చైర్ పర్సన్ అమృతలత సోమవారం తెలిపారు.

ఆధ్యాత్మికం..

మల్లికార్జున స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

బోధన్‌రూరల్(బోధన్): పెంటాకుర్దులోని మల్లికార్జున స్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠాపన, దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన లక్ష్మీ గణపతి ఆలయం

రుద్రూర్: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. నవయుగ గణేష్ మండలి విరాళాలతో తొలుత ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఔత్సాహికులు ఆలయ నిర్మాణ కమిటీగా ఏర్పాటై ఆలయాన్ని సుందరంగా నిర్మించేందుకు కమిటి సభ్యులు విశేష కృషి చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వసంత సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భారీగా విరాళాలు సేకరించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి విరాళంతో పాటు ఆలయ ప్రహరీకి సీడీసీ నిధులు మంజూరు చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ఈ నెల 27 నుంచి 29 వరకు లక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. బ్రహ్మశ్రీ యజ్ఞం వివేక్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగనుంది.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి శివాలయంలో పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకిసేవ నిర్వహించారు.

సంక్షిప్తం

పరీక్ష సామగ్రి వితరణ

కమ్మర్ పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు గ్రామ వీఆర్ఏ మ్యాకల శంకర్ సోమవారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, రాజేందర్, నరసింగరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి స్కాలర్స్ స్కూల్, పెర్కిట్ శ్రీ భాషిత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికై నట్లు ఆయా పాఠశాల యాజమానులు సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో స్కాలర్స్ స్కూల్ నాలుగవ తరగతి విద్యార్థి తాళ్ల తేజ, శ్రీ భాషిత పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థులు మనస్వి, అక్షిత, నాలుగవ తరగతి విద్యార్థి రిషిక, మూడో తరగతి విద్యార్థి బీ భువేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వారికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

శ్రీచంద్రహైస్కూల్ విద్యార్థులు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని శ్రీ చంద్రహై స్కూల్ పాఠశాల విద్యార్థులు అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చాట్ల రవి తెలిపారు. అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పరీక్షలో పాల్గొన్న జాగర్ కుసూర్(1వ తరగతి) ఎస్ అనూష (4వ తరగతి)విద్యార్థులు ప్రతిభ కనబరిచి, తృతీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

నందిపేట విద్యార్థి ప్రతిభ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థినీ ఎస్ . వర్ధిని రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచింది. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ అరుణ్ అభినందించారు

వ్యాసరచన, క్విజ్ పోటీలు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో బాల్కొండ ఖిల్లా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఖిల్లా గురించి వివిధ అంశాలపై పోటీలు పెట్టారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రైతులపై చిన్నచూపు తగదు

నవీపేట: కేంద్ర ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్‌సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడారు. మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఆచరించడం లేదని ఆరోపించారు. నాయకులు గూడురు కిషన్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై పంట దిగుబడులు ఆరబెట్టొద్దు

బాల్కొండ: రోడ్లపై పంట దిగుబడులను రైతులు ఆరబెట్టవద్దని ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి సోమవారం హెచ్చరించారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టినా, రాళ్లు పెట్టినా కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డుపై ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణాలు పోతున్నాయన్నారు. రైతులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు.

జాకోరా విండో ఉపాధ్యక్షుడిపై అవిశ్వాసం

వర్ని: వర్ని మండలం జాకోర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు గఫార్‌పై సంఘ సభ్యులు వారం క్రితం అవిశ్వాసం నోటీసును జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా పదిమంది డైరెక్టర్లు అవిశ్వాసం నోటీసుపై సంతకాలు చేశారు. ఈనెల 27న ఉదయం 11 గంటలకు సహకార సంఘంలో ఉపాధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నట్లు సంఘం సీఈవో రామకృష్ణ వెల్లడించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు మంచి పేరును తీసుకురావాలని రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు రోటరీ క్లబ్(ఆర్మూర్) ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్సీ పూజలు

నవీపేట: నాళేశ్వర్‌లోని పురాతన రాజరాజేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత సోమవారం పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు.బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	క్రాక్-జీతేగా తో జీయేగా (హిందీ) - 10.10, 3.40, 9.45 తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి (తెలుగు) - 1.30 సుందరం మాస్టర్ (తెలుగు) - 7.01
స్క్రీన్-2 –	భ్రమ యుగం (తెలుగు) - 12.00, 9.10 సిద్ధార్థరాయ్ (తెలుగు)-3.00 ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 6.10
స్క్రీన్-3 –	ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35 సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-4 –	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05 మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా - 1.50, హనుమాన్ (తెలుగు)-06.50 సుందరం మాస్టర్ (తెలుగు) - 10.10